క్లుప్తంగా

ప్రజల ఆరోగ్యం తాకట్టు పెడతారా ?

రాజోళి: రాజకీయాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని తాకట్టు పెడతారా అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు అన్నారు. శాంతిగనర్ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అలంపూర్ చౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని గతంలో ఉన్న బీఆర్ఎస్ ఓట్ల కోసం నిర్మిస్తే ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు ప్రారంభిస్తుందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యానికి, ఆస్పత్రి నిర్మాణానికి ముడిపెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో హనుమంతు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలు వైభవంగా జరుపుకొన్నారు. సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలను విద్యార్థినులతో పాటు ఉపాధ్యాయులు కలిసి ఎత్తుకున్నారు. అమ్మవారు, పోతురాజు వేషధారణల్లో విద్యార్థినులు అలరించారు. కార్యక్రమంలో ఎస్ఓ గోపిలత, ఇన్‌చార్జ్ ఎస్ఓ రమ్యశ్రీ, రాధ, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దార్శనికుడు అచ్యుతానందన్



గద్వాల: నూతన పరిపాలన విధానాలతో అట్టడుగు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు దక్కేలా పాలన చేసిన దార్శనికులు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోలీస్ బృందానికి అభినందనలు



అయిజ: ఇటీవల అయిజలో జరిగిన చోరీకి సంబంధించిన కేసును వేగంగా చేధించిన నేపథ్యంలో మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ రంజిత్‌కుమార్, కానిస్టేబుల్ పర్సాద్‌కుమార్, గోవిందును అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్దకల్: అతిగా మద్యం తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని ఎల్కూర్‌కు చెందిన తెలుగు వెంకట్రాములు (40) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 20న మల్దకల్ వైన్స్‌షాపులో అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్సీలో పుస్తకాల పంపిణీ

అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మంగళవారం విద్యార్థులకు సంబంధించిన వర్క్‌బుక్స్‌తో పాటు యూనిఫాం క్లాత్‌ను ఎంఈఓ రాములు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

❖ ఇటిక్యాల మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో వర్క్‌బుక్స్‌ను ఎంఈఓ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజు పారాయణ మహాయజ్ఞం

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ భాగవత పారాయణ మహాయజ్ఞం మంగళవారం ఐదో రోజు వైభవంగా సాగింది. వికాస తరంగిణి, విశ్వ హిందూ పరిషత్, ధర్మప్రసార సమితి సంఘాల సభ్యులు భాగవత సప్తాహ పారాయణం చేశారు.

వ్యాధుల కాలం.. జర పైలం!



తక్కశిలలో నిల్వ నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యాధికారులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైనం

ఉండవెల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలుషిత నీరు, ఆహారం తీసుకోవడంతో పాటు పరిసరాల అపరిశుభ్రత కారణంగా సాధారణ జ్వరం, జలుబు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, తదితర వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గ్రామాల్లో డ్రై డే పాటిస్తూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వారంలో రెండు రోజులు డ్రై డే

గతంలో వైద్య పంచాయతీ సిబ్బంది వారంలో ఒక రోజు (శుక్రవారం) డ్రై డే నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని పారబోయించి ప్రజలకు అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహిస్తున్నారు. డ్రై డేలో భాగంగా గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి తొలగించడం, చెత్తా చెదారాన్ని వీధుల్లో పేరుకోపోకుండా చర్యలు చేపట్టారు.

దోమల నివారణపై అవగాహన

మలేరియా, డెంగీ తదితర రోగాల బారిన పడేందుకు దోమలే ముఖ్య కారణం. వీటి కట్టడికి ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమతెర వినియోగం పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు, చర్యలు చేపడుతున్నారు.

వైద్యులు లేక ఇబ్బందులు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నా పల్లె దవాఖానాల్లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పల్లె దవాఖానాల్లో ఎంఎల్‌హెచ్‌పీలతోనే వైద్యం నిర్వహిస్తుండేవారు. కానీ గ్రామాల్లో వ్యాధులు ప్రభలుతుండడంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకే మొగ్గు చూపుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ఆర్ఎంపీలు జలగల్లా డబ్బులు లాగేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు పీహెచ్‌సీల పరిధిలో

మానవపాడు మండలంలోని పీహెచ్‌సీకి అటాచ్ ఉన్న గ్రామాల్లో ఏఎన్ఎంలు–7 మంది, ఆశాలు 27 మంది, క్యాతూరు పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంలు– 2, ఆశాలు 7 మంది మండలంలోని గ్రామాలకు వైద్యం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకే మండలాన్ని రెండు మండలాల పీహెచ్‌సీలకు అటాచ్ చేయడంతో ప్రజలు వైద్యం సదుపాయాలు సరిగా లేక పక్క రాష్ట్రానికి పరుగులు పెడుతున్నారు. మండలంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేసి వైద్యులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

నూతన మండలం కావడంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేసి వైద్యులను నియమించాలి. వేరే మండలాలకు చెందిన వైద్యులు మా మండలంలో విధులు నిర్వర్తించడానికి మొగ్గు చూపడం లేదు. మెరుగైన వైద్యం కోసం పక్క రాష్ట్రాలకు వెళ్తున్నారు. పీహెచ్‌సీని నిర్మించి వైద్యులను ఏర్పాటు చేయాలి.

– నాగరాజు, ఉండవెల్లి

చికిత్స అందిస్తాం

వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. పల్లె దవాఖానాల్లో ఏఎన్ఎంలను ఏర్పాటు చేసి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ మందులు అందుబాటులో ఉంచాం. త్వరలో పీహెచ్‌సీని నిర్మించి, జిల్లా వైద్యాధికారులతో పర్యావేక్షించి వైద్యులను నియమిస్తాం.

– ప్రసన్న రాణి, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేటీదొడ్డి మండల గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళల సంఘాలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఆర్టీసీ బస్సు, సోలార్ కేంద్రాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, వడ్డీలేని రుణాలు వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఎమెల్యే 337 సంఘాలకు రూ.34.61 లక్షల వడ్డీ లేని రుణాలను చెక్కుల రూపంలో అందజేశారు. రుణాల బీమా ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.11.87 లక్షల చెక్కు అందించారు. ఇందిర మహిళా శక్తి పథకం కింద 30 మహిళల సంఘాలకు రూ.3.30 కోట్ల రుణం మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ తహసీల్దార్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న బలిగెర శివారెడ్డి

గద్వాల: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పోటీ చేసిన ప్రతి స్థానంలో గెలిచేలా నాయకులు సన్నద్ధం కావాలని బీజేపీ నాయకుడు బల్గెర శివారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డీకే బంగ్లాలో జరిగిన పార్టీ నాయకకుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్ర జా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. బీజేపీపై అధికార, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేశాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, దేవదాసు నరేష్‌గౌడ్, అశోక్‌రెడ్డి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ధరూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది




గట్టు గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గట్టు/ధరూరు/మానవపాడు/ఎర్రవల్లి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సూర్యప్రకాష్ విద్యార్థినులకు సూచించారు. మంగళవారం గట్టులోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌పై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, వైద్య సిబ్బంది వెంకటేష్, వెంకటాద్రినాయుడు, స్వామి, పార్వతి పాల్గొన్నారు.

❖ ధరూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే డిగ్రీ బాలికల కళాశాల, జూనియర్ కళాశాలలో పీహెచ్‌సీ డాక్టర్ ఆయేషాబేగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హీర్యా నాయక్, సీహెచ్ఓ ఆనందయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

❖ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు పాటించాలని వై ద్యురాలు హేమమానస, వార్డెన్ పుష్పలత అన్నారు. మానవపాడు మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో అక్కమ్మ, చంద్రన్న, లక్ష్మి పాల్గొన్నారు.

❖ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. 122 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సూజర్‌వైజర్ వెంకటేష్, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన సమావేశంలో సిబ్బందితో వైద్యురాలు స్వరూపరాణి

మల్దకల్: గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూపరాణి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం టీబీ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జయరాం, వెంకటస్వామి, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

రాజోళి: తాము చదువుకున్న బడిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించారు పాఠశాల పూర్వ విద్యార్థులు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతిగనర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శిథిల భవనంలో ఉన్న రాళ్లను మంగళవారం ట్రాక్టర్లతో తరలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మ, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అస్లాం షరీఫ్, రాముడు, నూరుద్దీన్, రవి, మురళి, భాస్కర్‌గౌడ్, మాలిక్ తదిదరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి.మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల కు చెందిన భజన మండలి సభ్యులుభజనలోపాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

ధరూరు: మండల పరిధిలోని గార్లపాడుకు చెందిన జంగిలప్ప అనే వ్యక్తి అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. శనివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయిన జంగిలప్ప ఎంతకూ రావడంతో కోడలు రామేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జంగిలప్ప ఇద్దరు కుమా రులు వివిధ కారణాలతో మృతి చెందగా మనస్థాపం ఉండేవాడని రామేశ్వరి పేర్కొన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు.

ఉరుకుందకు పాదయాత్రగా భక్తులు



రాజోళి: కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద వీరన్నస్వామి ఆలయానికి భక్తులు మంగళవారం పాదయాత్ర ప్రారంభించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఉరుకుంద క్షేత్రంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తా రు. ఈ ఏడాది గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల భక్తులు స్థానిక భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూ జలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు.

మండల కేంద్రంలో కుక్కల బెడద

ఉండవెల్లి: మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని సీఐటీయూ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి బాషకు వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా రాత్రుళ్లు మనుషుల మీద దాడి చేస్తున్నట్లు తెలిపారు. కుక్కలను తరలించి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ఈ నెల 25 నుంచి 28 వరకు జూనియర్ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను విజయవంతం చేయాలని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతంలోని ప్రొఫెసర్ జయశంకర్ విద్యా క్రీడా ప్రాంగణంలో తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



ధరూరులో ఓ ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీలత



సాతర్లలో చెత్త తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ధరూరు: మండల కేంద్రంలోని ఫర్టిలైజ్ దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత తనిఖీ చేశారు. మంగళవారం ‘సాక్షి’ పత్రికలో ‘కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు’ అనే శీర్షికన యూరి యా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై సమగ్ర వార్తా కథనాన్ని ప్రచురితం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా యూరియా విక్రయించాలన్నారు. గట్టి మందులను అంటగట్టే ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుకు ప్రతి కొనుగోలుకు సంబంధించి రశీదులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్పందించిన విద్యుత్ అధికారులు



మానవపాడులో ఒరిగిన స్తంభాన్ని సరిచేయిస్తున్న దృశ్యం

మానవపాడు: మండల కేంద్రం నుంచి గోకులపాడు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభంను విద్యుత్ అధికారులు సరిచేశారు. ‘ఒరిగిన విద్యుత్ స్తంభం’ అనే శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మంగళవారం విద్యుత్ స్తంభానికి మరమ్మతు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన అధికారులు

ఇటిక్యాల: గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం అనే శీర్షిక ‘సాక్షి’ దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం సాతర్ల గ్రామంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె, నీటి బోరుకు మరమ్మతు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన ‘సాక్షి’కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర నీటివాటాను కాపాడుదాం



మాట్లాడుతున్న పల్లయ్య

అయిజ: గోదావరి నదిలో రాష్ట్ర నీటివాటాను కాపాడుదామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కుట్రలను తిప్పికొడదామని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాయితేజ ఒకేషనల్ కళాశాలలో రెండు రాష్ట్రాల నీటివాటాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లయ్య బనకచర్ల ప్రాజెక్ట్, ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి 200 టీఎంసీల నీటిని అక్రమంగా తరలించేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. విద్యార్థి సమాజం మేల్కొని బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం జరగకుండా పెద్ద ఎత్తున పోరాడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రాజు, రాకేష్, సతీష్, నరేష్, రమేష్, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



కేటీదొడ్డి కేజీబీవీలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

ధరూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మంగళవారం మీర్జాపురం ఖమ్మంపాడు ప్రాథమిక పాఠశాల, ఉప్పేరు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లలను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం నిర్వహిస్తున్న బేస్‌లైన్ టెస్టులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాజరుశాతంపై దృష్టి పెట్టాలి

కేటీదొడ్డి: విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, నందిన్నె, పాఠశాలను సందర్శించి హాజరు వివరాలు తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ పద్మావతి, విజయభాస్కర్, సీఆర్పీ శివరాజ్ పాల్గొన్నారు.

ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం



అయిజలో ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అయిజ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఒడిషా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ వెంకటేష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎన్ఎస్‌యూఐ విద్యా సంఘం ఒడిషా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ చేసిన పనికి దేశం సిగ్గుపడుతుందన్నారు. 19 ఏళ్ల అమ్మాయిపై అత్యాచారం చేసిన ఘటనతో దేశం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన విద్యార్థి నాయకులే అత్యాచారం చేయడం శోచనీయమన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆర్గనైజేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, సంయుక్త కార్యదర్శి నరేష్, పట్టణ కమిటీ సభ్యులు రహీం, శ్రీహరి, సద్దాం, నిఖిల్, విజయ్, బలరాం, నరేష్ పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



లింగన్‌వాయి బురదలో నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని లింగన్‌వాయి గ్రామంలోని రోడ్లు బురదమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి జేకే ఈదన్న అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి బురదలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈదన్న మాట్లాడుతూ.. గ్రామంలోని కోట్ల వీధి నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలో అంతర్గత రోడ్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. విద్యార్థులు, వృద్ధులు బురదలో నడుస్తు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. మండలంలో పేరుకు మాత్రమే పెద్ద గ్రామమని సమస్యలకు కేంద్ర బిందువుగా మారిందని మండిపడ్డారు. చిన్నపాటి వర్షానికే రోడ్ల మీద వర్షపు నీరు, బురద పారతుండటం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమని మండిపడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓసీకి వినతిపత్రం

అయిజ: ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ సోష ల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల రీజనల్ కోఆర్డినేటర్ (ఆర్సీఓ) సులోచనమ్మకు వినతిపత్రం అందజేశారు. గురుకుల విద్యాలయా ల్లో సీట్లు సాధించిన ఐదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వేరే జిల్లాల్లో సుదూర ప్రాంతాల్లోని విద్యాలయాల్లో సీట్లు కేటాయించడం వలన ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వారి వారి జిల్లాలోనే సీ ట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తిమ్మప్ప, నాగేష్ పాల్గొన్నారు.

విత్తనాలు వెదజల్లి మొక్కలు పెంచుదాం

అయిజ: రోడ్డు పక్కన ప్రయాణం చేసేటప్పుడు గుప్పెడు విత్తనాలు వెదజల్లి మొక్కలు పెరిగేందుకు దోహదపడుదామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. మంగళవారం అయిజ శివారులో ఖా ళీ ప్రదేశాల్లో విత్తనాలు వెదజల్లే కార్యక్రమం చేపట్టా రు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్ కుమార్ ఉరుకుంద, రామంజనేయులు పాల్గొన్నారు.